సాక్షి
బాపట్ల
మంగళవారం ; 13 ; మే ; 2025



ఘనంగా అంకమ్మతల్లి వార్షికోత్సవం

పెదకూరపాడు: 75త్యాళ్లూరులో వైశాఖ పౌర్ణమి సందర్భంగా అంకమ్మతల్లి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పొంగళ్లు సమర్పించారు.



భక్తిశ్రద్ధలతో చండీహోమం

దుగ్గిరాల: కంఠంరాజు కొండూరులో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా చండీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



వైభవంగా సీతారామ శాంతికల్యాణం

రేపల్లె: రేపల్లె ఒకటో వార్డు ఎస్టీ కాలనీలోని సీతారామ మందిర వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. శాంతి కల్యాణం కనుల పండువగా జరిగింది.

న్యూస్‌రీల్

నేడు పొగాకు రైతులకు మేరుగ పరామర్శ



చినగంజాం: నియోజక వర్గంలో ఇటీవల మృతి చెందిన.. ఆత్మహత్యాయత్నం చేసిన పొగాకు రైతు కుటుంబాలను పరామర్శించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున మంగళవారం నియోజకవర్గానికి రానున్నారు. తొలుత వీరన్నపాలెంలో అప్పుల బాధతో మృతి చెందిన ఉప్పుటూరు సాంబశివరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. అనంతరం ఇంకొల్లు మండలం దుద్దుకూరులో రుణాల బాధతో ఆత్మహత్యాయత్నం చేసుకొని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బిల్లా శ్యాంసన్ కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఒంగోలు కిమ్స్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న శ్యాంసన్‌తో మాట్లాడతారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పర్చూరు ఇన్‌చార్జ్ గాదె మధుసూదనరెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు భవనం శ్రీనివాసరెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు పాల్గొంటారన్నారు. ఆయా కార్యక్రమాల్లో నియోజక వర్గంలోని పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

ఘనంగా బుద్ధ జయంతి



అమరావతి: బుద్ధ జయంతి వేడుకలను ధాన్యకటక బుద్ధవిహార ట్రస్టు చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు ఆధ్వర్యంలో స్థానిక పాత మ్యూజియంలోని మహా చైత్యం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ వావిలాల మాట్లాడుతూ 2569 ఏళ్ల క్రితం గౌతమ బుద్ధుడు నడయాడిన అమరావతి నగరం దక్షిణ భారతదేశంలో బౌద్ధ ధర్మానికి కేంద్ర బిందువుగా కొనసాగిందన్నారు. సాక్షాత్తు గౌతమ బుద్ధుడు తన మొదటి కాలచక్ర క్రతువులు అమరావతి నుంచే ప్రారంభించారని బౌద్ధ సాహిత్యకారుల నమ్మకమన్నారు. అందుకే ఇక్కడ బుద్ధుని అస్థికలతో కూడిన మహా చైత్యం అనే గొప్ప కట్టడాన్ని నిర్మించారన్నారు. తొలుత మహాస్తూపం వద్ద ప్రత్యేక పూజాకార్యక్రమాలు, బౌద్ధమత ప్రార్థనలు నిర్వహించారు. నిమ్మా విజయసాగర్ బాబు, కోలా వెంకటేశ్వర రావు, యోగాశ్రమ నిర్వాహకులు కోనూరు అప్పారావు ప్రపుల్ల రాణి, గిరి స్వామి, పలువురు బౌద్ధ మతస్తులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియేట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పల్నాడు జిల్లా పరిధిలో 30 పరీక్ష కేంద్రాలలో మొదటి సంవత్సరం పరీక్షకు 93.34 శాతం, ద్వితీయ సంవత్సరం పరీక్షకు 87.99 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలిరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్షకు సెట్-3 ప్రశ్నపత్రాన్ని లాటరీ ద్వారా ఎంపిక చేశారు. జూనియర్ ఇంటర్‌కు 3,132 మంది జనరల్ విద్యార్థులకుగాను 2,945మంది హాజరయ్యారు. 154 మంది ఒకేషనల్ విద్యార్థులకుగాను 122మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు జనరల్ విద్యార్థులు 413 మంది నమోదు కాగా 364 మంది, ఒకేషనల్ విద్యార్థులు 70మందికి గాను 61 మంది హాజరయ్యారు. జిల్లా పరిధిలో ఎటువంటి మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా ఇంటర్మీడియేట్ విద్యాశాఖాధికారి కె.సుచరిత తెలిపారు.

సమస్యలను వారంలో పరిష్కరిస్తాం



కొల్లిపర(తెనాలి): తమకు అందిన ప్రతి సమస్యను వారంలో పరిష్కరిస్తామని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గుంటూరు జిల్లా కొల్లిపరలో మంత్రి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహతో కలిసి 200 వినతులు స్వీకరించారు. వీటిలో అత్యధికంగా బియ్యం కార్డుల దరఖాస్తులే ఉన్నాయి. అనంతరం మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ ప్రభుత్వం కొత్తగా కోటి 46 లక్షల మందికి రేషన్‌కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు.



జనసందోహం నడుమ ఊరేగింపుగా వెళ్తున్న భావదేవుడు

యుగయుగాల దేవుడు.. భావదేవుడు

- వైభవంగా భావదేవుడి రథోత్సవం
- జనసందోహంగా మారిన రథంబజార్
- ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు

బాపట్ల: భావపురి నడిబొడ్డున కొలువుతీరిన భావదేవుడి రథోత్సవం సోమవారం సాయంత్రం వైభవంగా జరిగింది.రూ.1.50కోట్లతో నిర్మించిన నూతన రథంపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీక్షీర భావన్నారాయణ స్వామివారికి సోమవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో అలయ అర్చకుల సమక్షంలో అంగరంగ వైభవంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామివారిని గరుడ వాహనంపై పట్టణంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం నుంచి 1432వ నవాహ్నిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి రథోత్సవాన్ని నిర్వహించారు.



రథోత్సవంలో పాల్గొన్న మాజీ డెప్యూటీ స్పీకర్ కోన

కిటకిటలాడిన వీధులు

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి తరలిరావడంతో రథంబజార్ సెంటర్ భక్తులతో కిటకిటలాడింది. భక్తులు స్వామివారి రథాన్ని లాగేందుకు పోటీపడ్డారు. స్థానిక భావన్నారాయణ స్వామి దేవాలయం నుంచి రథం బజార్ సెంటర్ మీదుగా ఆంజనేయస్వామి దేవాలయం వరకు రథోత్సవం నిర్వహించారు. ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత భక్తులు స్థానిక భావన్నారాయణస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి రథానికి కొబ్బరి కాయలు కొట్టి తమ మొక్కులు చెల్లించుకున్నారు.

భావన్నారాయణస్వామి ఆశీస్సులతో దేశం సుభిక్షం

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

బాపట్ల: శ్రీ భావన్నారాయణ స్వామి ఆశీస్సులతో దేశ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అన్నారు. సోమవారం స్వామివారి రథోత్సవాన్ని కొబ్బరికాయ కొట్టి ఆయన ప్రారంభించారు. స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బాపట్ల భావపురి కాలనీలో కొలువైన శ్రీ మత్యుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ క్షీరభావన్నారాయణ స్వామి 1432వ బ్రహ్మోత్సవాల్లో పాల్గొనటం ఆనందంగా ఉందన్నారు. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేదీ నుంచి 19 వరకు జరగనున్నాయని తెలిపారు. రూ.1.50కోట్లతో నూతన రథాన్ని తయారు చేయించామన్నారు. స్వామివారి కల్యాణ మహోత్సవం అనంతరం నూతన దివ్య రథంలో నగరోత్సవం నిర్వహించడం శుభపరిణామన్నారు. స్వామి వారి ఆశీస్సులతో దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని కోరారు. స్వామివారి దివ్య రథ నగర ఉత్సవంలో బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి, బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం కొండయ్య, గుడి వంశ పారంపర్య ధర్మకర్త రమణబాబు, బాపట్ల ఆర్డీఓ పి.గ్లోరియా, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



భావన్నారాయణస్వామి రథోత్సవంలో పాల్గొన్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నూతన రథం.. స్వామికి అంకితం

- ఘనంగా పునుగు రామలింగ మల్లేశ్వర స్వామి రథోత్సవం
- సంవత్సరాల తర్వాత రథంపై దర్శనమిచ్చిన స్వామివారు
- ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ పునుగు రామలింగ మల్లేశ్వరస్వామి రథోత్సవం సోమవారం రాత్రి విద్యుత్ దీపాల అలంకరణలో వైభవోపేతంగా సాగింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా భక్తుల సహకారంతో నూతన రథాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో పాటు ఎమ్మెల్యే ఎంఎం మాలకొండయ్యకు దేవస్థాన అధికారులు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దేవదాయ శాఖ కృషి చేస్తుందన్నారు. అంకితభావంతో సేవలందిస్తున్న అధికారులను అభినందించారు. వేగంగా విస్తరిస్తున్న చీరాల పట్టణానికి ఆధ్యాత్మికంగా కేంద్రంగా ఉన్న పునుగు రామలింగ మల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మరింత సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేసిన రథానికి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల శివనామస్మరణల నడుమ రథాన్ని ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పెద్ద రథంపై ఉత్సవ మూర్తులు ఊరేగుతూ దర్శనమివ్వడంతో తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. రథోత్సవం సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



ప్రత్యేక అలంకరణలో నూతన పెద్ద రథం

లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: రైతుల నుంచి లక్ష్యం మేరకు ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ధాన్యం సేకరణపై అనుబంధ శాఖల అధికారులు, రైస్ మిల్లర్ల అసోసియేషన్ ప్రతినిధులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం అధికంగా సాగవుతున్న నేపథ్యంలో 30 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం సేకరించాలని ప్రభుత్వం లక్ష్యం విధించిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 4,038 మంది రైతుల నుంచి 25,300 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. అకాల వర్షం హెచ్చరికల నేపథ్యంలో రైతులకు నష్టం జరగకుండా వెంటనే ధాన్యం సేకరించాలని ఆదేశించారు. సేకరించిన ధాన్యాన్ని జిల్లాలోని ఆరు గోదాముల్లో నింపాలన్నారు.

ప్రతిరోజూ 3వేల మెట్రిక్ టన్నుల సేకరణ

జిల్లా వ్యాప్తంగా 70 రైస్ మిల్లులు ఉన్నాయని, అయితే ప్రస్తుతం 30 మిల్లుల్లో పోర్టిఫైడ్ రైస్ ఉత్పత్తి చేస్తున్న నేపథ్యంలో వాటి నుంచి మాత్రమే సేకరిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తమ్మవరంలో 15 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం ఉన్న గోదాము ఖాళీగా ఉందన్నారు. ప్రస్తుతం అన్ని ప్రాంతాల నుంచి సేకరించి ధాన్యాన్ని తమ్మవరం గోదాముకు తరలించాలన్నారు. ప్రతిరోజు 3000 మెట్రిక్ టన్నులకు తగ్గకుండా ధాన్యం సేకరణ చేపట్టాలని అధికారులు, మిల్లర్ల యజమానులను ఆయన ఆదేశించారు. పీడీఎఫ్ బియ్యం సేకరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను పక్కాగా అమలు చేయాలని ఆయన సూచించారు. పౌర సరఫరాల సంస్థ జీఎం పి.శ్రీనివాసరావు, పౌర సరఫరాల శాఖ అధికారి విలియమ్స్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి రామకృష్ణ, డీసీఓ శ్యాంసన్, రైస్ మిల్లర్ల యజమానులు పాల్గొన్నారు.



రైస్‌మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్

విపత్తుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

బాపట్ల: విపత్తు నిర్వహణ, పర్యవేక్షణపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. విపత్తు నిర్వహణ, పర్యవేక్షణపై జిల్లా, డివిజన్, మండల, గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ శిక్షణా కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విపత్తు సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటే ప్రాణ నష్టాన్ని నివారించగలమని కలెక్టర్ చెప్పారు. రానున్న వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలన్నారు. అవగాహనతోనే విపత్తు నుంచి ప్రాణాలు రక్షించుకోగలమని ఏపీఎస్‌డీఎంఏ సాంకేతిక నిపుణులు బస్వంత్ చెప్పారు. ప్రజలను అప్రమత్తం చేయడానికే విపత్తు సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు ఎస్ఎంఎస్, వాయిస్ రికార్డింగ్‌ల రూపంలో చేరవేస్తున్నామన్నారు. డీఆర్‌ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు డివిజన్, మండల, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొడవు ముక్కు.. సొగసైన కాళ్లు .. తీక్షణ చూపు.. మెరిసే ఛాయ.. ప్రకృతి ఒడిలో పక్షులు.. ఊరొచ్చిన విహంగాలు
అవే గ్రామీణుల ఆత్మ బంధువులు.. విదేశాల నుంచి వచ్చిన అతిథులు

పిట్టా..పిట్టా మా ఊరికొచ్చావా?

- ఆవాసం మార్చిన విదేశీ పక్షులు
- వెలమవారిపాలెంలో సహకరించని ప్రకృతి
- మైలవరం గ్రామానికి రాక
- పక్షులను ఆత్మబంధువులుగా భావిస్తున్న గ్రామస్తులు
- ఖండాంతరాలు దాటి వస్తున్న పిట్టలు





మైలవరంలో విదేశీ పక్షుల సందడి

అద్దంకి: జీవ వైవిధ్యం లేకుంటే ప్రకృతి మనుగడ అసాధ్యమే.. మనుషులు.. జంతు జాలాలను ప్రేమించి సంరక్షించకుంటే పర్యావరణ పరిరక్షణ కష్టమే. ఇలాంటి ప్రకృతి సత్యాన్ని బాపట్ల జిల్లా వాసులు ఎన్నో తరాలుగా అనుసరిస్తున్నారు. నైజీరియా.. కొరియా ప్రాంతాల్లో ప్రస్తుతం విపరీతమైన చలి వాతావరణం నెలకొంటుంది. అందుకే ఆయా దేశాల్లో సంచరించే పక్షులు ప్రతి ఏటా బల్లికురవ మండలం వెలమవారిపాలేనికి తరలివస్తుంటాయి. ఇక్కడ సంతానోత్పత్తి అయిన తర్వాత తిరిగి తమ దేశాలకు ఎగిరి పోతుంటాయి. కానీ ఈ ఏడాది వెలమవారిపాలెంలో పక్షులు నివసించేందుకు గత మూడేళ్లుగా సరైన వాతావరణం లేకుండా పోయింది. ముఖ్యంగా అవి నివసించే చెట్లు నేలమట్టం కావడంతో తల్లడిల్లిపోయాయి. అందుకే ఈ పక్షులు రూటు మార్చాయి. తమకు అనువుగా ఉండే చుట్టు పక్కల ప్రాంతాలను అన్వేషించి విజయం సాధించాయి.

500 విహంగాల సందడి

బల్లికురవ మండలం వెలమావారిపాలేనికి పక్కనే.. అద్దంకి మండలం మైలవరం వాటికి అనువైన ప్రదేశంగా మారింది. మొదట్లో తక్కువ సంఖ్యలోనే ఇక్కడకు చేరుకున్న పక్షులు.. ఈ ఏడాది తమ మందీ మార్బలంతో.. అక్క చెల్లెళ్లు, బంధు మిత్రులతో కొలువుదీరాయి. ప్రస్తుతం 500కు పైగా పక్షులు గ్రామానికి చేరుకోవడంతో స్థానికులంతా వాటిని అతిథులుగా.. పక్షి రాజులుగా భావించి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాటి రాక శుభ సూచికంగా భావిస్తున్నారు. సాధారణంగా ఈ పిట్టలు డిసెంబర్ నెలాఖరులో వచ్చి జూలై నెల నాటికి తాము పొదిగిన పిల్లలకు రెక్కలు రాగానే తిరిగి తమ దేశాలకు పయనమై వెళ్లేవి. అయితే ఈ సంవత్సరం మే నెలలో రావడంతో నవంబరు నెల వరకు ఇక్కడే ఉండే అవకాశం ఉందని గ్రామస్తులు భావిస్తున్నారు.

సమృద్ధిగా నీరు-నీడ..

మైలవరం గ్రామంలో నిండు కుండలా ఉండే పెద్ద చెరువుపై ఈ పక్షులు మనసు పారేసుకున్నాయి. సమీపంలో గుండ్లకమ్మ నది, మరి కొంత దూరంలో శింగరకొండ క్షేత్రానికి సమీపంలో భవనాశి చెరువు కూడా ఉండటం విశేషం. గ్రామంలోని చెట్లపై తమ గూళ్లు నిర్మించుకొని.. ఆహారం కోసం నిత్యం సుమారు యాభై కిలో మీటర్ల మేర ప్రయాణించి సాయంత్రానికి తమ నివాసాలకు చేరుకుంటాయి. అలాగే స్థానిక చెరువులో కూడా చేపల వేట సాగిస్తుంటాయి.

ముందుకాడ కొన్నే వచ్చేయి



మూడేళ్ల మించి మా ఊరికి ఈ పిట్టలొత్తన్నాయి. అయ్యి భలే గోల చేత్తాయి. మునుపు వెలమవారిపాలెంలో కనిపించేయి. ఇప్పుడేమో మా ఊళ్లోకే వత్తన్నాయి. మా పిల్లోళ్లు.. ఆటిని చూసి కుశాల పడతున్నారు.

–సత్యనారాయణ

గవర్నమెంటోళ్లు కాపాడాల



ఈ పిట్టలు మా పిల్లోళ్లతో సమానమే. ఏడ నుంచే ఈడ కొత్తన్నాయంటే పాపం.. వాటికేం కట్టమొత్తాదో. ఆటి జోలికెవురైనా ఎలితే ఊరుకోం. ఈడ చెరువులో నీళ్లు బాగుండాయి. మేత కూడా ఉంది. గవర్నమెంటోళ్లు ఈటిని కాపాడాల.

- చావలి శ్రీనివాసరావు

పన్నెండు గంటల నిర్విరామ నృత్య ప్రదర్శన

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : స్థానిక మార్కెట్ కూడలిలోని శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో విజయమాధవి సేవ సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షురాలు విజయమాధవికిశోర్ ఆధ్వర్యంలో జరగ్గా, 12 గంటలపాటు రత్నాచార్యులు, నృత్య కళాకారులు చేపట్టిన నృత్యాలు అలరించాయి. అనేక మంది కళాకారులు, వారి శిష్యుల అద్భుత నృత్య ప్రదర్శనలు చక్కటి హావ భావాలతో ప్రదర్శించారు. అనంతరం నాట్యాచార్యులను, కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో సినీ నటులు రాగిణి, నాగమణి, టి.రజినీరెడ్డి, సీనియర్ గుండె వైద్యులు రామారావు, హైకోర్టు న్యాయమూర్తి కె.శ్రీనివాసమూర్తి ప్రసంగించారు.



నాట్యాచార్యులు, కళాకారులకు సత్కారం

తెలుగు సాహితీ సంబరాల్లో తెనాలి కవులు

తెనాలి: ఏలూరులో శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈనెల 10, 11 తేదీల్లో 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ సంబరాల ముగింపు సందర్భంగా ఆదివారం రాత్రి జాతీయ ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. తెనాలికి చెందిన కవి, రచయిత డాక్టర్ రంగిశెట్టి రమేష్‌కు కవి రత్న సాహితీ పురస్కారం ప్రదానం చేసి సత్కరించారు. ప్రముఖ సాహితీవేత్తలు, కళాకారుల సమక్షంలో సంస్థ సీఈవో డాక్టర్ కత్తిమండ ప్రతాప్, జాతీయ కార్యదర్శి ఈశ్వరి భూషణం, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి ఈ అవార్డును అందజేశారు.

ఆళ్ల నాగేశ్వరరావుకు తెలుగు భాషా సేవా సాహితీ పురస్కారం...

ఇదే వేదికపై తెనాలికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావుకు తెలుగుభాషా సేవా సాహితీ పురస్కారాన్ని ప్రదానం చేశారు. వృత్తిపరంగా గుంటూరు-2 ఆర్టీసీ డిపోలో కండక్టర్ గా విధులు నిర్వర్తిస్తున్న ఆళ్ల నాగేశ్వరరావు, ప్రవృత్తిగా సాహితీ సేద్యం చేస్తున్నారు. వచన కవితా ప్రక్రియలో ఇప్పటికీ రోజుకో సామాజిక అంశంతో కవితను రాస్తున్నారు.



రంగిశెట్టి రమేష్‌కు కవిరత్న పురస్కారం ప్రదానం

డాక్టర్ ప్రజ్ఞాచారికి తెలుగు భాషా సేవా పురస్కారం

తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీ రత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి తెలుగు భాషా సేవా జాతీయ ప్రతిభా పురస్కారాన్ని ప్రదానం చేశారు. చైతన్యవంతమైన భావ జాలంతో రచనలు చేస్తూ, తెలుగు భాష అభ్యున్నతికి తనదైన శైలిలో కృషి చేస్తున్నందుకు, ఆయన సాహితీ సేవలను గుర్తించి జాతీయ తెలుగు భాషా సేవా పురస్కారాన్ని ప్రదానం చేశామని నిర్వాహకులు వెల్లడించారు.

క్లుప్తంగా

ఇండో చైనా యుద్ధంలో గాయపడిన తాతయ్య భార్యకు నివేశన స్థలం



బాపట్ల: ఇండో చైనా యుద్ధంలో గాయపడిన కేశన తాతయ్యకు ప్రభుత్వం అండగా నిలిచిందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఈ మేరకు తాతయ్య భార్య అలివేలమ్మకు బాపట్ల మండలం ఈస్ట్ బాపట్ల రెవెన్యూ గ్రామ పరిధిలో 0.06 సెంట్లు స్థలాన్ని అందించారు. కార్యక్రమంలో ఆర్డీఓ గ్లోరియా ఉన్నారు.

జూన్ 6న వేద పాఠశాల పునఃప్రారంభం

నగరంపాలెం (గుంటూరు వెస్ట్) : స్థానిక మారుతీ నగర్‌లోని శ్రీకంచి కామకోటి పీఠ శ్రీమారుతీ దేవాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆర్ష ధర్మ సమితి వేద స్మార్త సంస్కృత శాస్త్ర పాఠశాల ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి వచ్చే నెల ఆరో తేదీ నుంచి పునః ప్రారంభమవుతున్నట్లు దేవాలయ కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో వేదం, స్మార్తం అభ్యసించాలనుకునే విద్యార్థులు ఎనిమిదేళ్ల నుంచి 13 ఏళ్ల లోపు వయసు, ఉప నయనం అయిన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 98488 72729 నంబర్‌లో, లేదా మారుతీనగర్‌లోని దేవాలయ ప్రాంగణంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

పసుపు ధరలు

దుగ్గిరాల: స్థానిక పసుపు యార్డుకు సోమవారం 993 బస్తాలు వచ్చాయి. మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. కొమ్ములు 705 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,000, గరిష్ట ధర రూ.11,300, మోడల్ ధర రూ.10,450 పలికింది. కాయలు 288 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,101, గరిష్ట ధర రూ.11,300, మోడల్ ధర రూ.10,450 లభించింది. మొత్తం 744.750 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు కార్యదర్శి తెలిపారు.

పోలురాధా పందేలు అదరహో!



పోలురాధా ఎడ్ల పందెంలో పాల్గొన్న ఎడ్ల జత

చినగంజాం: కడవకుదురు గ్రామ దేవత పోలేరమ్మ తిరునాళ్లను పురస్కరించుకొని రెండు తెలుగు రాష్ట్రాల న్యూ జూనియర్ నాటుబండి పోలురాధా ఎడ్ల పందేలు ఆదివారం సాయంత్రం ప్రారంభం కాగా సోమవారం వేకువజాము వరకు నిర్వహించారు. పోటీల్లో పలు ఎడ్ల జతలు పాల్గొనగా అత్యంత ఉత్కంఠంగా కొనసాగాయి. అనంతరం నిర్వాహకులు ఎడ్ల జతల యజమానుల విజేతలను ప్రకటించి వారికి అందజేశారు. బాపట్ల జిల్లా అమృతలూరు మండలం పెదపూడి గ్రామానికి చెందిన ఆలా హరికృష్ణ యాదవ్ ఎడ్ల జత 5605.2 అడుగుల దూరం లాగి మొదటి స్థానం సాధించింది. కేకే కన్‌స్ట్రక్షన్స్‌కు చెందిన బత్తిన కోటేశ్వరరావు రూ.30,116 అందజేశారు. గుంటూరు జిల్లా కాకుమాను మండలం గార్లపాడు గ్రామానికి చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత 5100 అడుగులు లాగగా ద్వితీయ బహుమతి సాధించింది. రావి సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం వారి కుమారుడు రావి శ్రీనివాసరావు రూ.25,116 అందజేశారు. బాపట్ల జిల్లా చినగంజాం మండలం సోపిరాల గ్రామానికి చెందిన చెరుకూరు ఉషారాణికి చెందిన ఎడ్ల జత 5060.7 అడుగులు లాగి మూడో స్థానాన్ని సాధించాయి. కేశన వెంకట్రావు రూ.20,116 నగదు బహుమతి అందజేశారు. నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన బొడ్డు బాలకృష్ణకు చెందిన ఎడ్ల జత 4868.5 అడుగులు లాగి నాలుగో స్థానం సాధించగా అడుసుమల్లి బ్రదర్స్ రూ.15,116 నగదు అందజేశారు. బాపట్ల జిల్లా బోయినవారిపాలేనికి చెందిన పిన్నబోయిన మహీంద్ర ఎడ్ల జత 4825.8 అడుగులు లాగి ఐదో స్థానం సాధించగా కేసన పిచ్చయ్య జ్ఞాపకార్థం రూ.10,116 నగదు అందజేశారు. బాపట్ల జిల్లా మున్నవారిపాలేనికి చెందిన కుమ్మరి నాగ శ్రావణి, చెరుకుపల్లికి చెందిన యలమందల వెంకట గోపాలకృష్ణకు చెందిన ఎడ్ల జతలు 4792.5 అడుగులు లాగి 6వ స్థానం సాధించగా కేసన చలపతిరావు, నాగరత్నం జ్ఞాపకార్థం కుమారులు రూ.7,516 నగదు బహుమతి అందజేశారు. పోటీలకు యాంకర్‌గా తంగడ హసన్ వ్యవహరించారు.



ప్రథమ బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

మహిళను కబళించిన లారీ

- వెనుక నుంచి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో మృతి
- వాహనం నడుపుతున్న వ్యక్తికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో పరిస్థితి సమీక్షిస్తున్న తహసీల్దార్ ప్రభాకరరావు, ఎస్ఐ రమేష్

చినగంజాం: ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇరువురిని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలైన సంఘటన సోమవారం చినగంజాం జాతీయ రహదారిపై కడకుదురు వద్ద చోటుచేసుకుంది. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. ఈపూరుపాలెం గ్రామం చేనేతపురికి చెందిన కొండ్రుపాటి ప్రభుదాసు అతనితో కలిసి అదే గ్రామానికి చెందిన కారంపూడి పద్మ(45) ఫంక్షన్‌లకు వంట పనిచేస్తుంటారు. ఈ క్రమంలో చినగంజాం వెంకటేశ్వర కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన వివాహ ఫంక్షన్‌లో వంట చేసి తిరిగి వెళుతున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారిపై ఎంత్రీ హోటల్ సమీపంలోకి వెళ్లగానే.. వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టడంతో ఇరువురు రోడ్డుపై పడిపోయారు. తలకు తీవ్ర గాయంకాగా పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుదాసుకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో చీరాల వైద్యశాలకు తరలించారు. అదే సమయంలో అటుగా వెళుతున్న చినగంజాం తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు పరిస్థితి గమనించి పోలీసులకు, అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎస్ఐ శీలం రమేష్.. శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతురాలిని చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతురాలి భర్త భిక్షాలు చేనేత కార్మికుడు కాగా అతడు గతంలోనే మృతి చెందాడు. ఆమె కుమార్తె శివపార్వతి వివాహితురాలు. తల్లి మృతితో సంఘటనా స్థలానికి వచ్చిన ఆమె భోరున విలపించడం చూపరులను కలచివేసింది.

నీటి కుంటలో పడి బాలుడు మృతి

చిమ్మిరి బండ ఎస్సీ కాలనీలో విషాదం



దుడ్డు కార్తీక్ (ఫైల్)

మార్టూరు: ప్రమాదవశాత్తూ నీటి కుంటలో పడి ఓ బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని చిమ్మిరిబండ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన దుడ్డు తిమోతి కుమారుడు కార్తీక్ (8) ఆదివారం సాయంత్రం తన తాతతో కలిసి గేదెలను మేపడం కోసం పొలం వెళ్లాడు. ఈ క్రమంలో గేదెలు కొండను ఆనుకొని ఉన్న కుంటలో నీరు తాగడానికి దిగాయి. గేదెలను కుంటలో నుంచి వెలుపలికి తోలడం కోసం కుంటలోకి ఒంటరిగా దిగిన కార్తీక్ అలాగే నీటిలో మునిగిపోయాడు. కొంతసేపటికి స్థానికులు నీటి కుంటలో దిగిన కార్తీక్ కోసం గాలించగా అప్పటికే మృతి చెందిన బాలుడు శవమై తేలాడు. ఆడుతూ పాడుతూ తమ ముందు చలాకీగా తిరిగే చిన్నారి శవమై ఇంటికి రావడంతో కుటుంబంతోపాటు ఎస్సీ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి.

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ నిలిపివేయాలి

కలెక్టరేట్ ఎదుట యూటీఎఫ్ ధర్నా



కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

నరసరావుపేట: పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న పాఠశాలల పునవ్యవస్థీకరణ ప్రక్రియతోపాటు ఏ విధమైన స్పష్టమైన జీఓలు లేకుండా రోజుకో ఆలోచనతో జరుగుతున్న ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాస రెడ్డి, ఎం.మోహనరావు డిమాండ్‌చేశారు. సోమవారం పాఠశాల విద్యాశాఖ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏఓకు వినతిపత్రం సమర్పించారు. తొలుత జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేసి దాని స్థానంలో కొత్త జీఓ విడుదల చేసి పాఠశాలలను పునవ్యవస్థీకరించాలని కోరారు. అన్ని ప్రాథమిక పాఠశాలల్లో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియాన్ని కొనసాగించాని, తరగతిలో విద్యార్థులు 45 మించితే రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలని సూచించారు. హైస్కూలులో విద్యార్థుల సంఖ్య 300 దాటితే అదనపు పీడీ పోస్టు కేటాయించాలన్నారు. బదిలీల జీఓ విడుదల చేసి వేసవి సెలవులలో ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ఎస్.జి.టి.లకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీ ప్రక్రియ చేపట్టాలన్నారు. జిల్లాలో సీనియారిటీ సమస్యలు పరిష్కరించిన తర్వాతనే పదోన్నతుల ప్రక్రియ చేపట్టాలని, బదిలీలు, పదోన్నతులు ప్రక్రియలు వేర్వేరుగా నిర్వహించాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ ఖాసీం పీరా, సహఅధ్యక్షులు ఏ బాగేశ్వరిదేవి, జేవీడీ నాయక్, కోశాధికారి ఎం.రవిబాబు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్, జిల్లా ఇన్‌చార్జి టీఎస్ఎన్ మల్లీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు ఉషాశౌరి రాణి, టి.వెంకట్, కె.తిరుపతిస్వామి, ఆర్.నాసర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోగుల సేవలో నర్సులది కీలకపాత్ర

- ఘనంగా అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం
- వాక్‌థాన్‌లో భారీగా పాల్గొన్న నర్సింగ్ విద్యార్థినులు



వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత దాస్

మంగళగిరి: రోగులకు వైద్య సేవలందించడంలో నర్సుల పాత్ర కీలకమని ఆల్ ఇండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) డైరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత దాస్ తెలిపారు. అంతర్జాతీయ నర్సింగ్ దినోత్సవం సందర్భంగా సోమవారం ఎయిమ్స్ ఆధ్వర్యంలో నర్సులు వాక్‌థాన్ నిర్వహించారు. ఎయిమ్స్ వెస్ట్ గేటు వద్ద డైరెక్టర్ డాక్టర్ అహెంతమ్ శాంత దాస్ జెండా ఊపి ప్రారంభించారు. ఎయిమ్స్ నుంచి వాక్‌థాన్‌గా మంగళగిరి పట్టణంలోని బస్టాండ్ సెంటర్ చేరుకుని, అంబేడ్కర్ విగ్రహ సెంటర్‌లో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సులు ప్రజలకు అత్యవసర పరిస్థితిలో అందించాల్సిన వైద్య సేవలు, కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు సీపీఆర్ డెమో చేసే విధానాన్ని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ రోగులకు వైద్యం అందించే సమయంలో డాక్టర్లతో పాటు నర్సుల పాత్ర ఎంతో విలువైనదని కొనియాడారు. రోగికి సపర్యలు చేస్తూ వ్యాధి నయమయ్యేందుకు నర్సులు కృషి చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



సీపీఆర్ డెమో నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు

14న విజయవాడలో ఉపాధ్యాయుల ధర్నా

ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బసవ లింగారావు



మాట్లాడుతున్న బసవ లింగారావు

గుంటూరుఎడ్యుకేషన్: విద్యారంగంతో పాటు ఉపాధ్యాయ బదిలీల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘ పిలుపు మేరకు మూడవ దశ పోరాటంలో భాగంగా ఈనెల 14న విజయవాడలో తలపెట్టిన ఉపాధ్యాయుల రాష్ట్ర స్థాయి ధర్నాను విజయవంతం చేయాలని ఏపీటీఎఫ్ ఉమ్మడి గుంటూరు జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం కన్నావారితోటలోని జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో అధ్యక్షుడు కె.బసవలింగారావు మాట్లాడారు. 117 జీవో రద్దుతో పాటు, పాఠశాల విద్యారంగంలో పూర్వ విధానాన్ని కొనసాగిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఇచ్చిన హామీని అమలు చేయకుండా, తొమ్మిది రకాల పాఠశాలలను ఏర్పాటు చేయడం సరైనది కాదని విమర్శించారు. దీనిపై ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినప్పటికీ పట్టించుకోలేదని తెలిపారు. బదిలీల్లో అన్ని కేడర్ల వారీగా ఖాళీలు చూపుతామని చెప్పి, ప్రస్తుతం ప్రతి మండలంలో కొన్ని ఖాళీల చొప్పున బ్లాక్ చేసేందుకు నిర్ణయించడం తగదని పేర్కొన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు సయ్యద్ చాంద్ బాషా, మక్కెన శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థి, ఉపాధ్యాయ నిష్పత్తి 1:20, ఉన్నత పాఠశాలలో 45 మందికి రెండవ సెక్షన్, ప్రాథమికోన్నత పాఠశాలకు కనీసం ఆరుగురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులను ఇవ్వాలని కోరినప్పటికీ ఫలితం లేదని తెలిపారు. ఉపాధ్యాయ బదిలీలల్లో సైతం గందరగోళ పరిస్థితులను తెచ్చారని విమర్శించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ఉదాసీనత విడనాడనాడకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఏపీటీఎఫ్ మూడు జిల్లా శాఖల ప్రధాన బాధ్యులు మహమ్మద్ ఖాలీద్, ఉస్మాన్, విజయబాబు, సీనియర్ నాయకులు జి.దాస్, ఎస్ఎస్ఎన్ మూర్తి, చక్కా వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిలర్ చెట్టిపోగు లక్ష్మణ్ కుమార్, మాలకొండయ్య, పి.శివరామకృష్ణ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతులు

జోన్–3లో 11 మంది అధ్యాపకులకు ప్రయోజనం

గుంటూరు ఎడ్యుకేషన్ : గుంటూరు జోన్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న 11 మంది అధ్యాపకులకు ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఇంటర్మీడియెట్ విద్యామండలి డైరెక్టర్ డాక్టర్ కె.కృతికా శుక్లా సోమవారం ఉత్తర్వులు విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన అధ్యాపకులకు తాత్కాలిక ప్రాతిపదికన ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ విడుదల చేసిన ఉత్తర్వుల్లో భాగంగా జోన్–3 పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో 11 మంది ప్రిన్సిపాళ్లుగా ఉద్యోగోన్నతి పొందారు.

■ సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎం. శ్రీనివాసరావు పెనుమాక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు, గుంటూరులోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల అధ్యాపకుడు బీఎస్ సురేష్ అచ్చంపేటకు, సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ అధ్యాపకురాలు యు. కోటేశ్వరమ్మ అద్దంకి జీజేసీ, నెల్లూరులోని కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు ఎం. రమణారెడ్డి నెల్లూరులోని డీకే జీజేసీ, నెల్లూరులోని కేపీసీ జీజేసీ అధ్యాపకురాలు జయమాలతి టంగుటూరు జీజేసీ, నెల్లూరు డీకే జూనియర్ కళాశాల అధ్యాపకురాలు బి. కృష్ణవేణి రాపూరు జీజేసీ, దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు కలవకొల్లు వాసు పొదిలి జీజేసీ, సత్తెనపల్లి జీజేసీ అధ్యాపకుడు వి.శ్రీనివాసరావు ఉదయగిరి జీజేసీ, పీవీ పాలెం జీజేసీ అధ్యాపకురాలు కె. లక్ష్మీ జ్ఞానేశ్వరి చేజర్ల జీజేసీ, వెంకటాచలం జీజేసీ అధ్యాపకురాలు జి.కరుణకుమారి వెంగమాంబపురం జీజేసీ, టంగుటూరు జీజేసీ అధ్యాపకుడు పి.సద్గుణరావు కొమరోలు జీజేసీకి ప్రిన్సిపాల్స్‌గా ఉద్యోగోన్నతి పొందారు. సంబంధిత అధ్యాపకులందరూ వారం రోజుల్లోగా కళాశాలల్లో ప్రిన్సిపాల్స్‌గా చేరాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో టెన్త్ సప్లిమెంటరీ హాల్ టికెట్లు

గుంటూరు ఎడ్యుకేషన్ : ఈనెల 19 నుంచి జరగనున్న పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థుల హాల్ టికెట్లను హెచ్ఎం లాగిన్‌తో పాటు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని డీఈవో సీవీ రేణుక సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దరఖాస్తు చేసిన పాఠశాలల హెచ్‌ఎంలు బీఎస్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా తమ లాగిన్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థులు 95523 00009 నంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయడం ద్వారా విద్యాసేవలను ఎంపిక చేసుకుని, తమ పేరు, పుట్టిన తేదీ, పాఠశాల పేరు, జిల్లా పేరు వివరాలతో హాల్ టికెట్లు పొందవచ్చని తెలిపారు.

ఈ నెల 20కి డీసెట్ గడువు పొడిగింపు

డైట్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించనున్న డీసెట్–2025 దరఖాస్తు గడువును ప్రభుత్వం ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు డీఈవో సీవీ రేణుక తెలిపారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి జైలు

ముప్పాళ్ల: హత్యాయత్నం కేసులో నిందితులకు జైలు, జరిమానా విధిస్తూ సత్తెనపల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి వి.విజయ్‌కుమార్‌రెడ్డి సోమవారం తీర్పునిచ్చారు. ఎస్ఐ వి.సోమేశ్వరరావు తెలిపిన వివరాలు.. మండలంలోని లంకెలకూరపాడుకు చెందిన చిట్యాల శ్రీనివాసరెడ్డి కుమార్తెను నరసరావుపేట మండలం దొండపాడుకు చెందిన పుట్లూరి నాగేశ్వరరెడ్డి 2021 జనవరి 16వ తేదీన ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఈ విషయమై చిట్యాల శ్రీనివాసరెడ్డి కుటుంబానికి పుట్లూరి నాగేశ్వరరెడ్డి కుటుంబానికి మధ్య గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో పుట్లూరి నాగేశ్వరరెడ్డి, పుట్లూరి కోటిరెడ్డి, ఏరువ తిరుపతిరెడ్డితో కలసి చిట్యాల శ్రీనివాసరెడ్డిపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనపై శ్రీనివాసరెడ్డి అన్న బాబుల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేర ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో సత్తెనపల్లి అసిస్టెంట్ సెషన్స్ జడ్జి ముగ్గురికి మూడు సంవత్సరాల జైలు శిక్షతోపాటుగా వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు. కేసుకు న్యాయవాదిగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బగ్గి నరసింహారావు, కోర్టు కానిస్టేబుల్ ఎస్‌కే జలీల్ చొరవ చూపారు.

బంగారం ఆభరణాలు చోరీ

పిడుగురాళ్ల: బ్యాంక్ నుంచి బంగారు ఆభరణాలను తీసుకొని వెళ్తుండగా ఆటోలో మాయమైన ఘటన సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మాచవరం మండలం చెన్నాయపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళ, పిడుగురాళ్ల పట్టణంలోని తమ్ముడు యడ్లపల్లి పుల్లారావు సహాయంతో పట్టణంలోని చైతన్య గోదావరి బ్యాంక్ లాకర్‌లో ఉన్న నగలను తీసుకుంది. పిడుగురాళ్ల పట్టణంలోని చెన్నాయపాలెం వెళ్లే ఆటో వద్దకు వెళ్లారు. ఊరు వెళ్తుండగా వీరితో పాటు మరికొంత మంది ఆటో ఎక్కి బ్రాహ్మణపల్లి సమీపంలో దిగారు. వారు దిగి వెళ్లిన తరువాత బ్యాగ్ చెక్ చేసుకోగా నగలు కనిపించలేదు. పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు. నగల బాక్స్‌లో నెక్లెస్, లాకెట్, చంద్రహారం, లాకెట్, నానుతాడు, ఐదు వరసల ఉంగరాల చంద్రహారం మొత్తం 170 గ్రాములు ఉన్నట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా లక్ష్మీ నృసింహస్వామి జయంత్యుత్సవం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు

మంగళగిరి: శ్రీ నారసింహ చతుర్దశిని పురస్కరించుకుని సోమవారం శ్రీ లక్ష్మీనృసింహస్వామి జయంత్యుత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ నారసింహస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి శ్రీదేవి భూదేవి సమేతుడై గ్రామోత్సవంలో దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కొబ్బరికాయలు కొట్టి ప్రసాదాలు స్వీకరించారు. స్వామి వారి జయంత్యుత్సవం అనంతరం పూర్ణాహుతి నిర్వహించారు.

రోగికి కేసు షీట్ ఇవ్వాల్సిందే..!

జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు



మాట్లాడుతున్న నాగేశ్వరరావు, పక్కన డాక్టర్ చదలవాడ హరిబాబు తదితరులు

గుంటూరు మెడికల్: రోగికి కేసు షీటు ఇవ్వాల్సిందేనని జాతీయ వినియోగదారుల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ చదలవాడ హరిబాబు అన్నారు. గుంటూరులోని గర్తపురి కన్జ్యూమర్స్ కౌన్సిల్ ఆఫీసులో సోమవారం వైద్య వివరాలు, హాస్పిటల్స్ విధులపై సమావేశం నిర్వహించారు. సమావేశానికి చేకూరి రాజశేఖర్ అధ్యక్షత వహించారు. డాక్టర్ హరిబాబు మాట్లాడుతూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెగ్యులేషన్ ప్రకారం రోగ నిర్ధారణ, పరిశోధన వివరాలు రోగికి తప్పనిసరిగా వైద్యాధికారులు తెలియజేయాలని తెలిపారు. రోగి మరణిస్తే అన్ని కారణాలు ఆ కేసులో తెలపాలని చెప్పారు. వైద్యులు ఏ మందులు ఎప్పుడు వాడారు..నర్సింగ్ సిబ్బందికి చెప్పిన సూచనలు కేసులో తేదీల వారీగా ఉండాలని, చికిత్స వివరాలు సమగ్రంగా ఉండాలని తెలిపారు. రోగి గానీ, అతని బంధువులు గానీ మెడికల్ రికార్డులు కావాలని అడిగిన తరువాత 72 గంటల్లో అందించాలని సూచించారు. రాజశేఖర్ మాట్లాడుతూ రోగికి రికార్డు ఇవ్వకుండా మెడికల్ ప్రాక్టీషనర్‌కు ఏ మినహాయింపు, ఏ చట్టం ఇవ్వలేదని తెలిపారు. మొత్తం చికిత్స వివరాల ఫొటో కాపీలు హాస్పిటల్ వారు ఇవ్వాలని సూచించారు. జిల్లా విజిలెన్స్ సభ్యుడు బీరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ హాస్పిటల్ వారు రోగికి వైద్య వివరాలను నిరాకరించడమంటే తన బాధ్యత నిర్వహణలో నిర్లక్ష్యమవుతుందని తెలిపారు. న్యాయస్థానాలు కోరినప్పుడు తప్పనిసరిగా సంబంధిత రోగి రికార్డులు సమర్పించాల్సి ఉంటుందని సూచించారు. బేబీ సరోజిని మాట్లాడుతూ వైద్యులు తప్పు చేసి ఉంటే అందువల్ల నష్టపోయిన రోగులు, కేసు షీటును సాక్ష్యాధారంగా కోర్టులో ఉపయోగించవచ్చని తెలిపారు. మునిపల్లె కవిత మాట్లాడుతూ రోగులకు చికిత్స చేసిన వివరాలను అందించడంలో పూర్తి పారదర్శకత ఉండాలని సూచించారు. కేసు సీట్ బాధ్యత వైద్యులు, హాస్పిటల్ పైన ఉందని చాలా కేసుల్లో కోర్టులు తీర్పులు ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు.

భర్త వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య



హేమలత మృతదేహం

గుంటూరు రూరల్: భర్త వేధింపులు భరించలేక వివాహిత ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాదులో ఆత్మహత్య చేసుకున్న ఆమె మృతదేహాన్ని పలు నాటకీయ పరిణామాల మధ్య అంబులెన్స్‌లో గుంటూరు శివారు ఓబులనాయుడుపాలేనికి తరలించడంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. బాధితులు, నల్లపాడు పోలీసుల కథనం ప్రకారం... ప్రత్తిపాడు మండల యనమదల గ్రామానికి చెందిన హేమలతకు 2020లో ఓబులనాయుడుపాలెం గ్రామానికి చెందిన మురళీతో కులాంతర వివాహం జరిగింది. హేమలత హైదరాబాదులోని ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తోంది. పెళ్లి అనంతరం కాపురాన్ని హైదరాబాద్ లింగంపల్లి ప్రాంతానికి మార్చారు. వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. భర్త మురళి జులాయిగా తిరుగుతూ, బెట్టింగ్‌లకు అలవాటు పడ్డాడు. డబ్బులు కోసం నిత్యం భార్యను వేధింపులకు గురిచేస్తూ ఉండేవాడు. చేసేదిలేక హేమలత తన శక్తికి మించి రుణాలు చేసి అడిగిన మొత్తం సర్దుబాటు చేసేది. ఇటీవల భర్త వేధింపులు ఎక్కువయ్యాయి. ఆదివారం భార్యాభర్తల మధ్య ఏం జరిగిందో తెలియదు. హేమలత అనుమానాస్పద స్థితిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు చెప్పకుండా భర్త ఆమె మృతదేహాన్ని నేరుగా అంబులెన్స్‌లో ఓబులనాయుడుపాలేనికి తీసుకు వచ్చాడు. విషయం తెలుసుకున్న హేమలత కుటుంబ సభ్యులు మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతురాలి తండ్రి కోటేశ్వరరావు నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ వంశీధర్ ఆదేశాల మేరకు ఎస్.ఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జీరో ఎఫ్ఐఆర్ చేసి కేసును హైదరాబాద్ చందానగర్ స్టేషన్‌కు బదిలీ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.